# మానవునికి ఈనాడు సత్సంగము అత్యవసరము

సద్భక్తులందరు భగవంతుడాయంచు
   చెవులకింపుగ స్మరణ చేయు దినము
బీదలవెతలన్ని ప్రీతితో నెరవేర్చి
   అన్నదమ్ముల మాడ్కి నున్న దినము
దైవచింతన చేయు భక్త బృందములకు
   ప్రీతి మృష్టాన్నము పెట్టు దినము
మహనీయులెవరైన మనకడ కేతెంచి
   చెలిమి భగవత్కథలు చెప్పు దినము
అట్టి దినమును దినముగా అనుభవించు
తక్కినదినములన్నియు తద్దినములె
ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు
సాధు సద్గుణగణ్యులౌ సభ్యులార!

ప్రేమస్వరూపులారా!

మనసుకు శాంతి అవసరము. శాంతి లేక సుఖములేదు. అనాదికాలమునుండి యీ శాంతి నిమిత్తమై మానవుడు అనేక విధములైన ప్రయత్నములు సల్పుతూ వచ్చాడు. కాని, శాంతిని అందుకోలేకపోతున్నాడు. కారణమేమిటి? శాంతికి మూలాధారమేమిటి? 'దేనివలన మనసుకు శాంతి యేర్పడును', అనే విచారణ ఈనాడు చాలా పెడమార్గం పట్టింది. 'ప్రాకృత సంబంధమైన పంచభూతములవలన లభించే సుఖమే మనసునకు శాంతి' అనే పెడమార్గములో మానవుడు యీ శాంతి నిమిత్తమై పాటుపడుతూ వచ్చాడు. కనులతో చూడటం, నోటితో మాట్లాడటం, చెవులతో వినటం, మనస్సుతో



srisathyasaivachanamrutam

అనుభవించటం, యీ విధమైన పంచేంద్రియములయొక్క తృప్తియే మానసిక శాంతికి దోహదం చేస్తుందని భావిస్తూవచ్చాడు. అధర్మము, అక్రమము, అనాచారములతో యీ ఆనందమనుభవించుటకు పూనుకున్నాడు. తనస్వార్థస్వప్రయోజనముల నిమిత్తమై పరులశాంతిని దోచుకొనుటకు ప్రయత్నిస్తున్నాడు. ఈ ప్రయత్నములచేత తనకుగానీ, తన సోదర మానవులకుగాని శాంతి, సౌఖ్యములు కరువైపోయినవి. పైగా అహంకారము,స్వార్థము పెరుగుతూ వచ్చాయి. అహంకారపూరితమైన ఈ స్వార్థ ప్రయోజనములచేత మానవునకు మానవునకు మధ్యనున్న మానవసంబంధము మట్టి గరచిపోయింది. మానవత్వానికి వుండిన సంబంధబాంధవ్యాలను పూర్తిగా దూరం చేసుకుంటూ వస్తున్నాడు.

**క్షీరసాగరముగా ఉండవలసిన మానవుని హృదయం ఈనాడు క్షారసాగరముగా మారిపోతున్నది**

మానవుని హృదయం పాలసముద్రమువంటిది. అట్టి క్షీరసాగరమునందే భగవంతుడు పవళిస్తాడని పురాణములయొక్క ప్రమాణము. క్షీరసాగరముగా వుండవలసిన మానవుని హృదయము యీనాడు క్షారసాగరంగా మారిపోతూ వచ్చింది. క్షీర మనగా తెలుపు అని. అనగా సాత్త్విక భావముతోకూడినదే మానవుని హృదయము అని భావము. ఈ సాత్త్విక హృదయమునందు శాంతి, ప్రేమ, సహనము, సానుభూతి యిత్యాది పవిత్రమైన గుణములు వాసము చేస్తుంటాయి. కాని, ఈ క్షీరసాగరమునందు నేడు తిమింగలములు, మొసళ్లు యింకా అనేక విధములైన క్రూరమృగములు నివసిస్తూవున్నాయి. ఈ మకర తిమింగలములే మనయొక్క అహంకార, స్వార్థములు. ఈనాడు మానవునియందు యీ స్వార్థము, అహంకారము పెచ్చుపెరిగిపోయినవి. దేనికైనను ఒక హద్దువుండాలి.

**నియమమే లేకపోయిన మానవత్వము నిర్మూలమైపోతుంది**

'నశ్రేయో నియమంవినా' అన్నారు. నియమమే లేకపోయిన మానవత్వం నిర్మూలమైపోతుంది. సూర్యచంద్రాదులకుకాని, నక్షత్రములకుగాని, ఋతువులకుగాని కొన్ని కొన్ని హద్దులేర్పరచుకొని వుంటున్నవి. ప్రకృతియే ఒక హద్దును అనుసరించి

sri sathyasai vachanamrutam

భగవంతుని నియమం ప్రకారము జరుగుతూ వస్తున్నాది.

**క్రమము తప్పక ప్రతిదినంబును భాను**
**డుదయాస్తమయముల నందనేల**
**క్షణమైన విశ్రాంతిగానక తాపవనుండు**
**జీవకోటులబ్రోవ వీవనేల**
**గగనంబునకు కాంతి కైసేయు తారలు**
**పగలు మాత్రము దాగు భంగియేల**

ఇవన్నీకూడను తమ తమ క్రమమును అనుసరిస్తూ వస్తున్నవి. పశుపక్ష్యాదులుకూడను తమతమ క్రమమును ఆచరిస్తూ వస్తున్నవి. తమ తమ యింద్రియములను స్వాధీనమునందుంచుకుంటున్నవి. కానీ పవిత్రమైన మానవుడు దివ్యమైన మానవ జన్మమును, ఉత్కృష్టమైన మానవ జీవితమును ఒక క్రమములో వుంచుకొనలేకపోతున్నాడు. పశుపక్షిమృగాదులకు ఏ విధమైన సంస్కారంలేదు. కాని మానవునకు గల సంస్కారమే సరైన త్రోవను చూపిస్తుంది. మానవుని వెంట వచ్చునది సంసారముకాదు, సంస్కారమే! అట్టి సంస్కారమును మనమీనాడు కోల్పోతూ వస్తున్నాము. మృగములంతా యే విధముగా పుట్టునో అదే విధమైన స్థితిలో మరణిస్తూ వస్తున్నవి. క్రూరముగా పుట్టిన పులి, చిరుత యిత్యాది మృగములకు యెన్ని విధములైన అభ్యాసములు చేయించినప్పటికిని తమ క్రూరగుణమును వదలలేకపోతున్నవి. కాని, మానవుడట్లుకాదు. కొన్ని అభ్యాసములచేతను, నియమములచేతను తాను దుర్గుణములను సద్గుణములుగా మార్చుకోగలడు.

**శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే**
**ధ్యానా త్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్**

మనం నడచే నడక, మాట్లాడే మాటలు, చెప్పే విషయములు, చేసే పనులు యివన్నీకూడను కేవలము అభ్యాసమువల్లనే అభివృద్ధి గాంచుతున్నవి. క్రూరుడుగా పుట్టిన మానవుడు పరమ శాంతిస్వరూపుడుగా జీవించటానికి అవకాశముంటుంది. దారిదోపిడి చేసే రత్నాకరుడుకూడను వాల్మీకి మహర్షిగా మారిపోయాడు. సద్బోధలచేత, సత్ప్రవర్తనలచేత,

srisathyasaivachanamrutam

సత్సంగముచేత మానవుని సంస్కారము అభివృద్ధి గాంచుతుంది. ఈనాడు మానవునికి సత్సంగము అత్యవసరము.

## దేహభ్రాంతిని బ్రద్దలు చేసినప్పుడు దైవం సాక్షాత్కరిస్తాడు

మనము చక్కని ఆరోగ్యము పొందవలెనన్న దీనికి రెండు మార్గములు అనుసరించాలి. ముందుగా శారీరకమైన ఆరోగ్యము మనకు అత్యవసరము. లోపలనున్న మాలిన్యాన్ని బయటకు పంపాలి. బయటనున్న పవిత్రమైన పదార్థములను లోపలికి పంపాలి. అప్పుడే యీ శరీరము ఆరోగ్యాన్ని పొందుతుంది. అదే విధముగా మానసిక ఆరోగ్యముకూడను అత్యవసరము. మనసునందుండిన దుర్గుణములు, దురాలోచనలు, దుష్ప్రవర్తనలు, దుశ్చింతలు అనే మాలిన్యాన్ని మనము బయటకు పంపాలి. సద్గుణములు, సదాచారములు, సత్ప్రవర్తన, సత్సంగము అనే పవిత్రమైన వాటిని లోపలకు చేర్చాలి. 'ఆగమార్థంతుదేవానాం గమనార్థంతు రాక్షసాం' అన్నారు. అనగా 'ఓ దేవతలారా! మాలో ప్రవేశించండి. ఓ రాక్షసులారా! నాలో వుండినవారు బయటకుపొండి', అనే ప్రయత్నము మనమీనాడు చెయ్యాలి. హిరణ్యకశిపుని కుమారుడైన ప్రహ్లాదుడు మహాభక్తుడు. తండ్రి హరిద్వేషి, కుమారుడు హరిప్రియుడు. ఈ రెండింటికి సంబంధము యేమాత్రంలేదు. పరస్పర విరుద్ధమైన భావములను అనుభవిస్తూ వచ్చారు, ఆ తండ్రీతనయులు. హిరణ్యకశిపుడు దేవుడులేడని, ప్రహ్లాదుడు దేవుడు కలడని గాఢంగా విశ్వసించారు. దేవుడు ఎక్కడ గలడనేటువంటి ప్రశ్న, హిరణ్యకశిపునిది. ఇందుగలడందులేడను సందేహము వలదు అని ప్రహ్లాదుని వాదన. హిరణ్యకశిపుడొక స్తంభమును చూపించి 'యిందులో భగవంతుడున్నాడా?' అని ప్రశ్నించాడు. కలడని విశ్వసించాడు ప్రహ్లాదుడు. ఆ స్తంభమును బ్రద్దలుచేశాడు, హిరణ్యకశిపుడు. నరసింహుడు ప్రయత్నపూర్వకముగా లభించాడు. దీని అంతరార్థమేమిటి? మన దేహమే ఒక స్తంభము. ఈ దేహభ్రాంతిని మనము బ్రద్దలు చేసినప్పుడే అందులో దైవం ఆవిర్భవిస్తాడు. కానీ, అందుకు విరుద్ధంగా మనం యీనాడు దేహభ్రాంతిని దినదినము అభివృద్ధి గావించుకుంటూ వస్తున్నాము. యింద్రియవాంఛలను పోషించుకుంటూ వస్తున్నాము. పరమభక్తుడైన, పరిపూర్ణ విశ్వాసము కల్గిన ప్రహ్లాదుడు

sri sathyasai vachanamrutam

హరిని ప్రేమిస్తూ వచ్చాడు. కానీ, యిట్టి పరమభక్తుడైన ప్రహ్లాదునికి పరమ దుర్మార్గుడైన కుమారుడు పుట్టాడు. అతనే విరోచనుడు. ఈ విరోచనుడు నాస్తికుడు. కాని, అట్టి నాస్తికుడైన విరోచనునికి మరల పరమ భక్తుడు జన్మించాడు. అతనే బలిచక్రవర్తి. ఈ బలిచక్రవర్తి ప్రహ్లాదుని మనుమడు. బలిచక్రవర్తి పరమధార్మికుడు. ప్రజలయొక్క క్షేమసంతోషములను తన కంటికిరెప్పవలే కాపాడుతూ వచ్చాడు. ప్రజలక్షేమమే తన క్షేమముగా విశ్వసించిన వ్యక్తి. అట్టి ప్రేమ చక్రవర్తియే ఆనాటి రాజు. అతని పాలనలో దేశమంతయు సుభిక్షముగా సాగుతూ వచ్చింది.

**అహంకారమే మానవుని అధఃపతనమునకు మూలకారణము**

ఎన్ని సద్గుణములు వుండినప్పటికిని, మానవునియందు దుర్గుణములుకూడా ప్రవేశిస్తూ వుంటాయి. బలి చక్రవర్తియొక్క పేరు ప్రతిష్ఠలు రాజ్యములోపల పెరుగుతూ వచ్చాయి. ఈ కీర్తి ప్రతిష్ఠలు అనేక విధములుగా వ్యాప్తియైనప్పుడు తక్షణమే తనలో అహంకారము ప్రవేశించింది. అహంకారమే మానవుని అధఃపతనమునకు మూలకారణము. నిజానికి, మానవుని అహంకారమునకు అవకాశము లేదు. దేనిని చూచి అహంకారపడుతున్నాడు?

**సర్వతఃపాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం**
**సర్వతః శ్రుతి మల్లోకే సర్వమావృత్య తిష్ఠతి**

సర్వము భగవంతుడే అయినప్పుడు దేనిని చూచి అహంకారపడాలి? తాను నిమిత్తమాత్రుడు మాత్రమే! దేహము తనదికాదు. మనసు తనదికాదు. బుద్ధి తనదికాదు. తనయొక్క అంతః కరణ తనది కాదు. ఈ సర్వముకూడను ఆత్మయొక్క ప్రతిబింబములే!

**ఇంద్రియభోగము ఉండినంతకాలము మానవునకు శాంతి శూన్యమే!**

ఈనాడు మనసు-మనసు-మనసు అని దీనికి అనేక విధములైన ప్రతిబింబములుంటున్నాయి. వీటినే 'మనో అంశములు' అని పిలుస్తారు. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము యీ నాలుగు మనసుయొక్క ప్రతిబింబములే! పేరుకు నాల్గువుంటున్నవిగాని అన్నీటియందు మనసు యేకత్వాన్ని ధరించింది.

sri sathyasai vachanamrutam

సంకల్పవికల్పములతో వుండినప్పుడు యిది 'మనస్స'ని పిలువబడుతుంది. నిర్ణయాత్మకమైన స్థితికి వచ్చినప్పుడు 'బుద్ధి' అని పిలువబడుతుంది. చింతించే సమయములో దీనికి 'చిత్తము' అని పేరు. వ్యక్తిత్వాన్ని వ్యక్తీకరించే సమయములో దీనినే 'అహంకారమ'న్నారు. బ్రాహ్మణుడు ఒక్కడేగానీ వంటవానిని వంట బ్రాహ్మణుడని, పూజచేసేవానిని పూజారి బ్రాహ్మణుడని, పంచాంగము చెప్పే బ్రాహ్మణునికి పంచాంగ బ్రాహ్మణుడని అంటారు. ఇవన్నీ వృత్తులను బట్టి వచ్చే పేరులు. అదే విధముగనే ఒకే మనసుకు వృత్తులను బట్టి పేర్లు మారుతూ వచ్చాయి. సంకల్పములు చేసే సమయములో దీనికి మనసు అని పేరు. 'సంకల్పవికల్పాత్మకం మనః' అన్నారు. మంచి చెడ్డలయొక్క నిర్ణయములోపల ప్రవేశిస్తుంది యీ మనసే. అప్పుడు దీనిని బుద్ధి అన్నారు. నిత్యానిత్యవిషయ పరిశీలనా జ్ఞానము కల్గినది. కనుకనే యిది బుద్ధి అని పిలువబడుతూ వచ్చింది. మానవుని జీవితమంతయు యీనాలిగింటిపైనే ఆధారపడివుంటుంది. అయితే యీ మనసు యింద్రియములపైన ఆధారపడివుంటుంది. ఇంద్రియముల భోగభాగ్యాలను అనుభవించటానికి మనసు యిష్టపడుతుంది. ఈ యింద్రియములు, మనసుతోకూడిన జీవితమే సామాన్య మానవత్వము. ఇట్టి మానవత్వమే సుఖదుఃఖములతోకూడిన జీవితము. ఇంద్రియ భోగము వుండినంతకాలము మానవునికి శాంతి శూన్యమే. ఇంద్రియముల ప్రభావము యేమాత్రంలేకుండా దూరంచేసుకున్నప్పుడే వానికి శాంతి. కనుక మొట్టమొదట మనంచూసే చూపులు పవిత్రమైన చూపులుగా వుండాలి. దృశ్యాన్ని చూచి కన్నులు ఆనందిస్తాయి. ఈ ఆనందముచేత మనసుకు శాంతి యేర్పడుతుంది. అట్లని మనసు ఆశించిన దృశ్యాన్నంతా చూడటానికి ప్రయత్నించరాదు. ఆ విధమైన పెడమార్గం పట్టడంచేతనే మనసు మాలిన్యంగా మారిపోతుంది. చూడవలసినది ఒక్కటే! ఏకత్వమనే దివ్యత్వాన్ని మనం చూడాలి. అనేకత్వములో వున్న దివ్యత్వమైన యేకత్వాన్ని మనం సందర్శించాలి. ఈ విధమైన దృశ్యాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి ప్రహ్లాదుడు దేనినిచూచినా దివ్యత్వంగానే చూచాడు. లోపల, వెలుపల, చుట్టూ సర్వముకూడను దైవత్వముగానే దర్శించాడు.

**దివ్యత్వము లేకపోతే మానవత్వము వ్యర్థము**

అలాంటి మానవత్వాన్ని అభివృద్ధి గావించుకునే నిమిత్తమై, బలిచక్రవర్తి స్మృతి నిమిత్తమై యీనాడు 'ఓణం' అనే పవిత్రమైన దినము యేర్పడుతూ వచ్చింది. 'ఓణం' అనగా దీనికి మరొక అర్థము, నూతన వస్త్రములు ధరించటమని. తెల్లవారి లేచిన తక్షణమే అభ్యంగన స్నానము చేసి నూతన వస్త్రములు ధరించి, టెంకాయ ఆకులు తీసుకొని వచ్చి కొబ్బరి ఆకులలోపల పాయసంపెట్టి ఆనందముగా భుజించటం, ఓణంయొక్క అంతరార్థము. కానీ, ఆహార విహారములతోనే పర్వదినములను మనము అనుభవించరాదు. బలిచక్రవర్తి ప్రజల అభిమానాన్ని విశేషంగా చూరగొన్నాడు. అలాంటి ప్రభువును కోల్పోవటంచేత ప్రజలు చాలా దుఃఖిస్తూ వచ్చారు. తల్లి బిడ్డలను కాపాడినట్లు ప్రజలను కాపాడుతూ వస్తున్న ప్రభువు వారికి దూరంకావటంచేత ప్రజలు వియోగాన్ని భరించుకోలేకపోయారు. చాలా దుఃఖిస్తూ వచ్చారు. వారి దుఃఖమును చూచిన బలిచక్రవర్తి, 'ప్రతి సంవత్సరంకూడను మీ నిమిత్తమై నేను వస్తుంటాన'ని ప్రామిస్ చేశాడు. ప్రజలయొక్క క్షేమాన్ని, ప్రజలయొక్క ఆనందాన్ని, ప్రజలయొక్క సౌఖ్యాన్ని ఆశించిన చక్రవర్తియొక్క పునరాగమన దినోత్సవమే యీనాటి పర్వదినము. ఆనాటి ప్రజలు అవిధమైన ప్రభుభక్తి కల్గివుండేవారు. ఆనాటి ప్రభువులుకూడను ప్రజల ప్రీతిని చూరగొన్నవారు. ఈనాటి ప్రజలు, ప్రభువులమధ్య యీ విధమైన సన్నిహిత సంబంధ బాంధవ్యములు యెక్కడ చూసినా కన్పించటములేదు. ఈనాటి ప్రజలు స్వార్థ, స్వప్రయోజనముల నిమిత్తమై అహంకారముతో తమ జీవితాన్ని వ్యర్థము గావించుకుంటున్నారు. ఈనాటి ప్రభువులుకూడను తమ తమ స్థానం నిలబెట్టుకోటానికి ప్రాకులాడుతున్నారు. ప్రభువులయందుగాని ప్రజలయందు గానీస్వార్థం పెచ్చుపెరిగిపోయింది. కనుకనే దైవత్వం శూన్యంగా కనుపిస్తుంది. దివ్యత్వం లేకపోతే మానవత్వం వ్యర్థమని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇవన్నీకూడను క్షణభంగురాలు. క్షణికమైన యీ యింద్రియ సుఖములకై మన జీవితాన్ని వ్యర్థము గావించరాదు. యింద్రియానందమును యెంత మనము పొందినప్పటికిని అది తనివి తీరేదికాదు. అగ్నిలో కట్టెలు వేయుకొలది అగ్ని మరింతగా ప్రజ్వరిల్లుతుందేగాని ఆరిపోటానికి ప్రయత్నించదు. వాంఛలు పెరుగుకొలది మరింత బంధన యేర్పడుతుందేకాని, మోక్షముకాని, శాంతికాని చేకూరదు. కనుకనే మనము యీనాడు క్రమక్రమేణా యీ వాంఛలను తగ్గించుకుంటూ

srisathyasaivachanamrutam

రావాలి. ఈ వాంఛలను మనమెంత తగ్గించుకొందుమో అంత శాంతి మనలో యేర్పడుతుంది. Less luggage more comfort. మన బాధలు, మన కష్టములు, మన దుఃఖములు, మన భ్రాంతులచేతనే అభివృద్ధి అవుతున్నాయి. మన అశాంతికి మన కోరికలే మూలకారణము. ఈ కోరికలయొక్క ఫలితమే కర్మలయొక్క ప్రభావము. ఈ కర్మలయొక్క ఫలితమే మన సుఖదుఃఖములు. కనుక, మంచికర్మలను మనము ఆచరించాలి. అందువలననే వుపనిషత్తులంతాకూడను 'తస్మై నమఃకర్మణే', 'కర్మమునకు నేను మొదట నమస్కారం', చేస్తున్నాను అనే భావన పెంచుకోమని ఉద్ఘోషిస్తున్నాయి. మన సుఖదుః ఖములకు దైవం కారకుడు కాదు. కర్మాధికారి నీవు. కర్మఫలప్రదాత దైవము. ఎలాంటి విత్తనము నాటుకొందువో అలాంటి ఫలమే వస్తుంది. నీవు మంచి మొక్కను నాటుకుంటే మంచి ఫలములే వస్తాయి. కనుక, మనము పవిత్రమైన కర్మలలో ప్రవేశించాలి.

**మొట్టమొదట వ్యక్తిస్థాయిలో పవిత్రత ఉండాలి**

వ్యక్తి సక్రమమైన మార్గములో నడచినప్పుడే కుటుంబములో శాంతి వుంటుంది. వ్యక్తిత్వము పవిత్రమైనప్పుడే సమాజము పవిత్రమైనదిగా రూపొందుతుంది. సమాజము పవిత్రమైనప్పుడే దేశము పవిత్రముగా మారుతుంది. దేశము పవిత్రముగా వుండినప్పుడే యీ ప్రపంచమంతా పవిత్రముగా వుంటుంది. కనుక, మొట్టమొదట వ్యక్తిత్వమనే దాంట్లో పవిత్రత వుండాలి. ఈ పవిత్రత యెప్పుడు యేర్పడుతుంది? లోపల వున్న మాలిన్యములు రెండు, స్వార్థము మరియు అహంకారము. ఈ రెండింటిని మనము వెలుపల పారవేయాలి. కేవలము వెలుపల పారవేసినంత మాత్రమున చాలదు. బయట వున్న ప్రేమ, సహనము, సానుభూతి, పవిత్రాన్ని లోపల చేర్చాలి. జీవితము దివ్యమైన జీవితముగా రూపొందాలి. ఆదర్శవంతమైన రూపముగా మారాలి. మనం జీవిస్తున్నాము, పశుపక్షిమృగాదులవలె. మనం భుజిస్తున్నాము, పశుపక్షిమృగాదులవలె. మనము యింద్రియభోగములను అనుభవిస్తున్నాము కూడా. ఎక్కడ మన పవిత్రత? ఎప్పుడు చూచినా పరులను నిందించటము, పరులను విమర్శించటము, పరుల సుఖము చూచి ఓర్వలేకపోవటము, తన సౌఖ్యానికి తను అహంకారముగా వుఱ్ఱూతలూగటం. యీ విధమైన పశుత్వమే మానవుని



srisathyasaivachanamrutam

అథఃపతనము గావిస్తుంది. ఈనాడు ఎక్కడైనా మానవత్వముందా? మానవుడుగా కన్పిస్తున్నాడేగాని, మానవత్వం శూన్యమైంది. ఎక్కడాకూడా కన్పించటంలేదు. ఎక్కడ చూచినప్పటికినీ స్వార్థము, స్వార్థము, స్వార్థము. స్వప్రయోజనము. ఇది తరతరములనుండి వేళ్లు పాకిపోయినది. హృదయములోపల పాతుకొనిపోయిన యీ స్వార్థాన్ని పీకి పారవేయాలి. మనకు శాంతము, త్యాగమునందే! త్యాగమునందే మనకు ఆనందము. త్యాగమే మనకు అభయము. కారణమేమనగా, ఆశలుండినంతవరకు మనకు బాధలే! భయమే! త్యాగము చేసినప్పుడు అభయము. ఎట్టి భయముండదు. అందువలననే వేదము 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః' అని ఘోషించింది. కర్మయందు అహంకారము, ఫలమునందాసక్తి యీ రెండూ వదలితే అదే త్యాగము, అదే యోగము. మనం చేసే కర్మలయందు అహంకారాన్ని మనం అభివృద్ధి గావించుకోరాదు. 'ఇది నేను చేసిన కర్మ, దీని ఫలితము నాకే లభించాలి' అనే స్వార్థంకూడా వుండకూడదు. నీవు ఒక చెట్టు నాటవచ్చు. కానీ దాని ఫలములు నీకే లభిస్తాయనే నమ్మకము యేమిటి? నీవు కొన్ని నెలలో మరణించవచ్చు. కానీ, ఆ చెట్టులోని ఫలములు కొన్ని సంవత్సరాలకు నీ మనుమలు, కొడుకులు వచ్చి భుజించవచ్చు. కనుక, కర్మ ఫలము నీకే లభించాలనే శాసనం లేదు. చేయటమే నీ కర్తవ్యము. 'కర్తవ్యం యోగ ముచ్యతే'. అదే నిజమైన యోగము. కనుకనే మనము పవిత్రమైన కర్తవ్యములు నిర్వర్తించాలి.

**సాధారణంగా శ్రీమంతులకు త్యాగంచేసే అలవాటు ఉండదు**

అదే బలిచక్రవర్తి చేసిన మహాత్యాగం. గురువైన శుక్రాచార్యుడు బలి చేసే త్యాగాన్ని అడ్డగించాడు. 'చక్రవర్తీ! వచ్చినవాడు సామాన్యుడుకాడు. సాక్షాత్తూ నారాయణుడే యీ రూపం ధరించివచ్చాడు. అతను నిన్ను పరీక్షించే నిమిత్తమై వచ్చాడు', అని హెచ్చరించాడు. దానికి బలిచక్రవర్తి ఆనందించాడు. 'గురూజీ! సాక్షాత్తు నారాయణమూర్తే నావద్దకు వచ్చి చేయి చాచినప్పుడు నా చేయిపైన అతని చేయి క్రింద ఉండడం నాకు యెంత అదృష్టము', అన్నాడు. అడిగే వాని చేయి క్రింద వుంటుంది. ఇచ్చే వాని చేయి పైన వుంటుంది. కనుక, అక్కడ తన త్యాగము ఉన్నతస్థాయిలో వుంది అన్నాడు. ఈ విధంగా బలి చక్రవర్తి తన మాట



srisathyasaivachanamrutam

వినే స్థితిలో లేడని గుర్తించాడు, శుక్రాచార్యుడు. సూక్ష్మస్వరూపుడై ధారపోసే కలశరంధ్రానికి అడ్డుగా నిలచాడు. సర్వజ్ఞుడైన వామనమూర్తి యీ శుక్రాచార్యుడు చేస్తున్న ట్రిక్ గుర్తించాడు. ఈ చేసే దానానికి అడ్డు తగిలేవాడు, మహాపాపి.

**తాను పెట్టకున్న తగవు పుట్టదుగాని**
**ఒరులు పెట్టుటచూచి ఓర్వలేరు**
**దాత దగ్గర చేరి తనముల్లె పోయినట్టు**
**జిహ్వతో చాడీలు చెప్పుచుంద్రు**

ఇట్టి వారిని యేమని పిలవాలి అని ప్రశ్నించుకున్నాడు. త్యాగము చేసేవారికి అడ్డు తగిలేవారిని యేమని పిలవాలి, అని యోచించుకున్నాడు. 'భిక్షకు శత్రువు' అని పేరు పెట్టవలెనని నిర్ణయించుకున్నాడు. బెగ్గర్‌కు శత్రువు యెవరు? అన్నం అడుక్కోటానికి పోతాడు. అక్కడ యేదైనా పెడితే కాచుకుని వుంటాయి, కుక్కలు. కనుక, కుక్కలే యీ దానము చేసేవానికి అడ్డు తగిలేవి. ఈ యుక్తిని గుర్తించిన వామనమూర్తి ఒక చిన్న పుల్ల తీసుకొని పొడిచాడు అడ్డు తొలగించడానికి. అప్పుడు శుక్రాచార్యుని ఒక కన్ను పోయింది. ఈ విధంగా అతని పేరు గుడ్డి శుక్రాచార్యుడుగా మారిపోయింది. అతడు మహాగురువు. గురువు అంటే సర్వ ధర్మములు బోధించేవాడు. సర్వధర్మములు బోధించే గురువు దానమున కడ్డు తగలటం చాలా చెడ్డది కదా! బోధనలో అతడు మాత్రం గురువుగా వున్నాడు, ఆచరణలో గుడ్డిగా వున్నాడు. చెప్పటం మాత్రం చెబుతున్నాడు, కాని చేయటం లేదు. అందువల్లనే A man with a dual mind is half blind అన్నారు. మనం ఒకే mindగా వుండాలి. రెండు విధములైన మనసులు వుండరాదు. కనుక మనం చేయవలసినదేదో యివ్వవలసినదేదో, చూడవలసినదేదో, చెప్పవలసినదేదో అది హృదయపూర్వకముగా చెయ్యాలి. చక్కగా బుద్ధితో విచారణ చేసి పవిత్రమైనవే చేయాలి. పవిత్రమైనవే నీవు చూడాలి. పవిత్రమైనవే నీవు చెప్పాలి. భగవంతునికి లైఫ్ యివ్వటానికైనా సిద్ధముగా వుండాలి. అలాంటి సర్వసంగ పరిత్యాగియైనవాడే, యీ బలిచక్రవర్తి. సర్వస్వము వుంది.



sri sathyasai vachanamrutam

తనకు యేకొదవాలేదు. సుఖమునందుగాని ధనమునందుగాని, భోగభాగ్యములందు గాని యే విధమైన కొరతలేదు. సర్వమూ వుండి త్యాగము చేయవలసిన అవకాశము రావటం చాలా అదృష్టము. సాధారణంగా శ్రీమంతులకు త్యాగంచేసే అలవాటు రాదు. అలాంటివారు మరింత పిసినారులుగా మారుతారు. లోభులుగా రూపొందుతారు. కాని, బలిచక్రవర్తి త్యాగిగా మారిపోయాడు. ఇలాంటి త్యాగానికే యింత గొప్ప కీర్తి వచ్చింది.

**పవిత్రులు మరింత పవిత్రులు కావాలి, అపవిత్రులు పవిత్రములోనికి ప్రవేశించాలి**

మంచిలోకూడను చెడ్డపుడుతూ వుంటుంది. వారి వంశమంతా రాక్షసవంశం. అట్టి రాక్షశవంశములోకూడను ప్రహ్లాదుడు, బలిచక్రవర్తివంటి పరమభక్తులు జన్మించారు. బురదలోకూడను మంచి పవిత్రమైన కమలములు పుడుతూ వస్తుంటాయి. నీటియందే మంచి, చెడ్డలు రెండూ వుధ్భవిస్తాయి. మనిషిని ఆకర్షించే కమలములు ఉధ్భవిస్తాయి, మనిషిని పీల్చి పిప్పిచేసే జలగలుకూడను అందులోనే ఉధ్భవిస్తాయి. అట్లాగే మానవులయందుకూడను పవిత్రులు, అపవిత్రులుకూడా వుంటున్నారు. పవిత్రులు మరింత ఉత్తమోత్తమ పవిత్రులు కావాలి. అపవిత్రులు పవిత్రములోనికి ప్రవేశించాలి. ఇదే ఆదర్శవంతమైన జీవితము. మహనీయుల చరిత్రలన్నియూకూడను ఒక ఆదర్శాన్ని నిరూపిస్తూ వచ్చాయి. వారు ఆచరించిన ఆచరణలు మనం ఆదర్శముగా తీసుకోవాలి. అలాగే బలిచక్రవర్తి యీ రోజు దర్శనమిచ్చిన రోజని, వామనమూర్తి అవతారమెత్తిన దినమని మనము యేదో పండుగలు చేసుకున్నంత మాత్రమున ప్రయోజనములేదు. వామనమూర్తియొక్క పవిత్రమైన గుణములు, పవిత్రమైన బలిచక్రవర్తియొక్క త్యాగము మనలో ఆవిర్భవించాలి. ఆ విధముగా ఆవిర్భవించినప్పుడే ఆ ప్రభువుకు, ప్రజలకు మధ్య సన్నిహిత సంబంధ బాంధవ్యమేర్పడిపోతుంది. అలాంటి ప్రభువులు, అలాంటి ప్రజలు ఆనాడు జగత్తులో వుండేటువంటివారు. కానీ, యీనాటి మానవులు మంచిని చెడ్డగాను, చెడ్డను మంచిగాను భావిస్తుంటారు. ఒక చిన్న కథ.

**మనం అమృతపుత్రులు కావాలి, అనృత పుత్రులు కాకూడదు**

ఒక మహరాజు ఒకనాడు అభ్యంగనస్నానం ఆచరించాలని సంకల్పించుకున్నాడు.

srisathyasaivachanamrutam

ఆయన సర్వకార్యములుకూడను మహారాణియే చేసేటువంటిది. ఈనాటి శ్రీమంతులంతా భోజనానికి కూర్చుంటే వంటవాళ్లే వచ్చి వడ్డించాలి. భార్య ఎంతమాత్రం ముట్టుకోదు. కానీ, ఆనాడు భార్యయే భర్తకు వడ్డించాలి. తాను మహారాణి అయినాకూడను రాజుకు తానే serve చెయ్యాలి. అదీ ఆమె అలవాటు. ఆనాడు రాణి యింత తైలము చేతిలోనికి తీసుకుని మహారాజుకు అభ్యంగనస్నానము చేయించే నిమిత్తము తల అంటుతూ వుంది. ఆమె తల అంటుతూ వుంటే మహారాజు తలలోపల యెక్కడో రెండు తెల్ల వెంట్రుకలు కన్పించాయి. ఆమెకు విచారం అధికమైపోయింది. 'రాజుగారు వృద్ధులవుతున్నారు. జీవితము దినదినమునకు తరిగిపోతోంది. క్షణక్షణమునకూ యీ దేహప్రమాణమనేది తరిగిపోతుంది', అని తలంటుతూ తాను కంటి నీరు తుడుచుకుంటూ వుంది. మహారాజుగారి గృహము చుట్టూ అద్దాలతో వుండేవి, ఆనాటి రాజమందిరాలు. తలంటుకుంటున్న రాజు ఆమె కంటినీరు తుడుచుకోటం అద్దములో చూచాడు. అప్పుడు ప్రశ్నించాడు రాజు, 'ఎందుకు నీవు కంటిధారలు కారుస్తున్నావ'ని. ఆమె చెప్పటానికి యేమాత్రం ధైర్యంలేక తాను కొంత సందేహిస్తూ వచ్చింది. కడపటికి రాజుయొక్క వత్తిడిచేత ఆమె చెప్పింది, 'తమకు దినదినమునకు వయసు పెరిగిపోతున్నది. ఎంతకాలము జీవిస్తాము మనము యీ జగత్తులోపల? తమయొక్క జీవితము నిమిత్తమై నేను యోచిస్తున్నాను', అన్నది. ఈ విషయం తెల్సిన తక్షణమే రాజుకుకూడా తీవ్రమైన వైరాగ్యము పుట్టింది. ఎంత కాలం మనమీవిధముగా భోగభాగ్యాలలో జీవించటం, తినటము, తిరగటము, నిద్రించటము, అనుభవించటము? యింతేనా మన జీవిత లక్ష్యము? చాలు చాలు. యింక మిగిలిన శేషజీవితాన్ని దైవ చింతనతో సార్థకము చేసుకుందామనుకున్నాడు. ఇద్దరు అప్పటికప్పుడే అనుకున్నారు. మంత్రులను పిలిపించారు. రాజ్యమునువారికి అప్పజెప్పారు. ఇద్దరూ అరణ్యానికి వెళ్లారు. ఇరువురూ వెళ్ళి పోయేటప్పటికి ప్రజలు 'యిలాంటి పవిత్రమైన రాజులు మాకు చిక్కరు ఇలాంటి రాజులనంతా మనము దూరము చేసుకుంటున్నామే' అని వారుకూడను అరణ్యానికి వెళ్లి 'మీరు లేకపోతే మేము ఆ రాజ్యములో జీవించలేమ'ని చాలా మొరపెట్టుకున్నారు. 'ఎందుకోసం మీరు రాజ్యం వదలిపెట్టి వచ్చారు? ప్రజలపైన యేమైనా విరక్తి కలిగిందా? ప్రజలెవరైనా మిమ్మల్ని బాధపెట్టారా? ప్రజలెవరైనా మిమ్ము

sri sathyasai vahini vachanamrutam

నిందించారా? దీనికి కారణం చెప్పమ'ని ప్రార్థించారు. మహారాజు అతి శాంతముతో, ప్రేమతో ప్రజలను దగ్గరకు పిలచి నాయనా! యేదో కొంతకాలము రాజ్యము యేలినాము, మిమ్మల్ని అన్ని విధాలా ఆదరించాము. నా కర్తవ్యము నిర్వర్తించుకున్నాను. ఇక శేష జీవితాన్ని దైవప్రార్థనతో సార్థకం చేసుకోవాలని అనుకుంటున్నాను' అన్నాడు. ఈ మాట వినేటప్పటికి ప్రజలందరు ఒక్కతూరి గొల్లున యేడ్చారు. ఈ ప్రజలుకూడను ఒక వైపునకు పోయి తపస్సు చేస్తూ కూర్చున్నారు. ఒకనాడు బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు, ప్రజలకు. 'ప్రజలారా! మీ కేమి కావా'లని ప్రశ్నించాడు. స్వార్థరహితమైన ప్రజలానాడు 'స్వామీ! మా రాజుకు దీర్ఘాయువు అనుగ్రహించండి', అని ప్రార్థించారు. 'తథాస్తు' అన్నాడు, బ్రహ్మ. ఈ ప్రజలు గంతులు వేసుకుంటూ వెళ్లి మహారాజుకు చెప్పారు, 'మీకు యింకా యెంతో ఆయువు అందించాడు బ్రహ్మ. మీరు చిరంజీవిగా వుంటారు. దీర్ఘాయుష్మంతులుగా వుంటారు. కాబట్టి మీరు రాజ్యానికి రావాలి', అని ప్రార్థించారు. రాజు బయలుదేరాడు. రాజ్యానికి వస్తున్నాడు. కాని రాణి 'నేను రాను, నేను యిక్కడే వుంటాను', అంది. అప్పుడు ప్రజలు కొంత తప్పు అర్థము చేసుకున్నారు. మేము బ్రహ్మను మా మహారాజు దీర్ఘాయుష్మంతుడు కావాలని అడిగాము కాని మహారాణికొరకు మేము అడగలేదు. అందువలన ఆమెకు కోపం వచ్చిందేమోనని భావించారు. ఆ రాణి అటువంటిదికాదు, ఆమె విశాలమైన హృదయము కలది. ఆమె తపస్సు దీర్ఘంగా చేసింది. ఆమెకుకూడా బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. 'అమ్మా! నీవు దేనిని ఆశిస్తున్నావు? నీకేమి కావాలి?' అని ప్రశ్నించాడు. 'స్వామీ! మీరు రాజుకు దీర్ఘాయువు యిచ్చినది నిజమేనా, రాజు మాత్రం దీర్ఘాయువుగా వుండి రాజును ప్రేమించే ప్రజలకు దీర్ఘాయువు లేకపోతే అలాంటి రాజువుండి ప్రయోజనమేమిటి? కనుక, నా ప్రజలకుకూడా దీర్ఘాయువు అనుగ్రహించండి' అంది. ప్రజలు పవిత్రులైనవారుగా వుండినప్పుడే ప్రభువుకూడను పవిత్రుడు, దీర్ఘాయువుగా వుండాలి. ప్రజలకు లేని దీర్ఘాయువు రాజుకుండి ప్రయోజనమేమిటి? ప్రజలు, ప్రభువు దీర్ఘాయులుగా వుండాలని ఆశీర్వదించమని కోరింది. అప్పుడు యీమె చేసిన త్యాగానికి బ్రహ్మ 'ప్రభువు, ప్రజలు, నీవు దీర్ఘాయుష్మంతులైవుందురుగాక!' అని ఆశీర్వదించాడు. మనము త్యాగము చేయుకొలది మనకు భోగములు మరింత అధికముగా ప్రాప్తిస్తాయి. ఏ

sri sathyasai vahini amrutam

భోగములు? దివ్యమైన భోగములు. అదే మనయొక్క జన్మము. 'శృణ్వంతు విశ్వే అమృతస్యపుత్రాః!' మనం అమృత పుత్రులు కావాలి, అనృత పుత్రులు కాకూడదు. మన హృదయాన్ని క్షీరసాగరంగా మార్చుకోవాలి, క్షారసాగరంగా మార్చుకోరాదు. విశాలమైన హృదయంగా అభివృద్ధిపరచుకోవాలి, సంకుచిత భావాలు చేర్చుకోరాదు. అప్పుడే నారాయణుడు మన హృదయంలో నివాసం చేస్తాడు. అతనినే క్షీరసాగరశయనుడు అన్నారు. క్షీరసాగరుడంటే యేమిటి? నీయొక్క పవిత్రమైన హృదయంలో తాను పవళించి వుంటున్నాడు, అతనే మహావిష్ణువు.

భగవంతుని నివాసమైన మనసును అపవిత్రమైన దుర్గుణాలకు నివాసం చేసుకోటం యెంతటి అపవిత్రము! ఈ దుష్టగుణములను, దుష్టభావములను, దుష్టసంకల్పములను మనము తుడిచి పారవేయాలి. పవిత్రమైన భావాల్ని చేర్చుకోవాలి. నిస్వార్థమైన ప్రేమను నింపుకోవాలి. నిర్మలమైన భావాన్ని పెంచుకోవాలి. మన జీవితాన్ని భగవంతునికొరకు త్యాగంచేయాలి. అదే యీ బలిచక్రవర్తి చేసిన పవిత్రమైన కర్మ. నాటిమొదలు నేటివరకు కేరళ రాజ్యములోపల యీ పవిత్రమైన భావములచేత, ఉత్తేజమైన భక్తిశ్రద్ధలచేత యీ పండుగ ఆచరిస్తూ వస్తున్నారు.

**సంస్కృతికి, సంస్కారమునకు పుట్టినిల్లు, కేరళ**

కేరళదేశం చాలా పవిత్రమైనది. ప్రకృతి సౌందర్యముతో తులతూగుతుండేది. నిరంతరము కళకళలాడుతూ కిలకిలనవ్వుతుండేది. ఈ ప్రకృతి సౌందర్యమంతా పచ్చనితోరణంగా వుంటుంది. ఎక్కడ చూచినప్పటికి చాలా సౌందర్యమైన ప్రకృతిగా రూపొందుతుంది. సౌందర్యమనేది భగవంతుని స్వరూపము. కనుక God is beauty. Beauty is God. అందువల్లనే కేరళరాజ్యములోపల మూడు అవతారములొచ్చినవి. భగవంతుడు సాక్షాత్తు అవతరించటానికి అది ఒక పవిత్రస్థానము. ఇలాంటి పవిత్రమైన స్థానములను మనము పవిత్రమైన భావములతో సార్థకం గావించాలి. కేరళలోపల భక్తి ప్రపత్తులు చాలా మెండు. రాజకీయ మార్గములో కొన్ని అటూ యిటూ మార్పులు వచ్చినప్పటికిని ప్రజలయందు దివ్యమైన భావాలు ఆవిర్భవిస్తూ వుంటాయి. సంస్కృతికి,

sri sathyasai vachanamrutam

సంస్కారమునకు పుట్టినిల్లు కేరళ. ఏదో కొంతమంది వుండవచ్చును. కానీ, కేరళలోపల ఆధ్యాత్మిక చిత్తమనేది వారియొక్క స్వభావము. ఎలాంటి నాస్తికుడైనకూడను యేదో తనకు తెలియకుండానే దైవాన్ని అనుకొంటూవుంటాడు. దైవాన్ని స్మరిస్తూ వుంటాడు. బయట దైవము లేదని ఉచ్చరిస్తూ వుంటాడు, కాని లోపల దైవాన్ని చింతిస్తూ వుంటాడు. కేరళ రాజ్యము యిలాంటి పవిత్రమైన ఆధ్యాత్మిక శక్తిచేతను వాతావరణముచేతను నిండిన ప్రదేశము. నేడు రాజకీయ మాలిన్యముచేత క్రమక్రమేణా కొంతవరకు వారి పవిత్రత దిగజారిపోతోంది. కాని, కేరళ ప్రజలు అనాదికాలమునుండి అభివృద్ధి గావించుకొన్న ఆధ్యాత్మిక తత్త్వాన్ని అభివృద్ధి చేసుకుంటూరావాలి. ఎట్టి పరిస్థితులయందైనా మీ విశ్వాసము కోల్పోరాదు. అది తరతరములనుండి వచ్చిన సాంప్రదాయము. అదే సంస్కారము, అదే మీయొక్క పవిత్రమైన ధనము. ఆ ధనము తరిగేటువంటిదికాదు. ఆ ధనము కరిగేదికాదు. క్రమక్రమేణా పెరిగేదే! కేరళ ప్రజలారా! మీరు యీ ఆధ్యాత్మిక చింతనను క్రమక్రమేణా అభివృద్ధి గావించుకొని ప్రచారప్రబోధలచేత సర్వులకు ఆదర్శాన్ని అందిస్తూ, ఆనందించాలని ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 05-09-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము**

sri sathyasaivaharamrutam